
## మాటల దొంగలొచ్చారు

# మౌనంగా ఉండకండి

***మనిషిని మనిషిగా చూసే సమాజంలో మానవ హక్కులకు గుర్తింపు ఉంటుంది, గౌరవం ఉంటుంది.***

***మనిషిని మనిషిగా చూడడం సమాజానికీ పాలకులకూ నేర్పించే పోరాటమే మానవ హక్కుల పోరాటం.***

***ఆ చూపు అలవడితే హక్కులంటే ఏమిటో అర్థం అవుతుంది. వాటిని ఆదరించే సంస్కృతి అలవడుతుంది. ఆ చూపు కరువయిన సమాజంలో మానవ హక్కుల పోరాటం కష్టతరమైనది.***



ఈ ప్రయత్నంలో ఒక దశాబ్దం పైగా నిరంతరాయంగా కృషి చేస్తున్న మానవ హక్కుల వేదిక రాబోయే అక్టోబర్ 2,3 తేదీలలో తన మూడవ రాష్ట్ర మహాసభలను అనంతపురం పట్టణంలో జరుపుకుంటున్నది. ఆ సభలకు మీ మద్దతు, సహాయసహకారాలు కోరుతూ మా ఆలోచనలు మీతో పంచుకుంటున్నాం.

మనిషిని పెద్దకులం, చిన్నకులం అనీ మగ, ఆడ అనీ నాగరికులు, ఆటవికులు అనీ వర్గీకరించి కొందరికి ఉన్నతమయిన విలువ, కొందరికి హేయమయిన విలువ ఆపాదించిన సంస్కృతి మనది. కొందరు భూసురులయితే.. కొందరు చూడరానివారు, అంటరానివారు. కొందరికి స్వేచ్ఛ పుట్టుకతో వస్తే కొందరికి బానిసత్వం పుట్టుకతో వస్తుంది. ఇప్పుడు దానికి తోడు మనిషిని వస్తువులు కొనుక్కొనే వినియోగదారునిగా, శ్రమ చేసే కూలీగా, నాయకులను ఎన్నుకునే వోటరుగా, సభా ప్రాంగణాలు నింపే శ్రోతగా, జైలు ఊచలు లెక్కబెట్టే ఖైదీగా, పోలీసు తూటాల ఆడిట్‌లో గణాంకంగా, టివిపెట్టె ముందు ప్రేక్షకునిగా విడగొట్టి ఆస్తి అంతస్తు ఉన్న వాళ్లకు తప్ప ఇతరులకు విలువ లేకుండ చేసే కొత్త వ్యవస్థ వచ్చి చేరింది. పాత అసమానతల మీద గౌతమ బుద్ధుని కాలం నుండి జరుగుతున్న పోరాటాలు ఒక కొలిక్కి రాకముందే ఈ కొత్త అమానుషత్వం వాటి సరసన చేరింది. అవి ఒక దానినొకటి పెనవేసుకొని 'మనిషి' అన్న మాటకే తావు లేకుండ చేస్తున్నాయి.

**అనంతపురంలో జరిగే మానవహక్కుల వేదిక మూడవ రాష్ట్ర మహాసభలకు ఆహ్వానం**

# మరింత హక్కుల స్పృహ

'ప్రతీ ఒక్కరికీ ఒక ఓటు ఇచ్చే ప్రజాస్వామ్యాన్ని కల్పించాం. ప్రతీ ఒక్కరికీ ఒకే విలువ ఇచ్చే సమాజాన్ని నిర్మించుకోవడం కోసం' అని బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని ఒక్క వాక్యంలో వివరిస్తూ ఆమోదం కోసం రాజ్యాంగ పరిషత్‌లో ప్రవేశపెట్టాడు. ఆయన ఆకాంక్షలలోని నిజాయితీ గురించి ఎవరికీ సందేహం లేదుగానీ భారత రాజ్యాంగం అనేక రాజీల పర్యవసానంగా తయారయింది. అది కల్పించిన ప్రజాస్వామ్యం అంబేద్కర్ ఆశించినంత బలమైనది కాదు. అట్లాగని అసలే శూన్యమూ కాదు. ఉన్న హక్కులను కాపాడుకుంటూ, లేనివాటి కోసం ఉద్యమిస్తూ, రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ఒక పక్క పెంపొందిస్తూ, దానిని సాధనంగా మలచుకొని సామాజిక ఆర్థిక ప్రజాస్వామ్యం కోసం – అంబేద్కర్ మాటలలో ప్రతీ మనిషికీ ఒకే విలువ ఇచ్చే సమాజం కోసం – మానవ హక్కుల ఉద్యమం కృషి చేస్తున్నది. ప్రజాతంత్ర స్వభావంగల సామాజిక రాజకీయ కృషిలోనూ, ఉద్యమాలలోనూ తన పాత్రను నిర్ధారించుకొని పని చేస్తున్నది. ప్రజాతంత్ర విలువలనూ చైతన్యాన్నీ సమాజంలో పెంపొందించడం, వాటికి సాధనాలుగా ఉపకరించగల చట్టాలనూ పాలనా నియమాలనూ డిమాండ్ చేయడం, సాధించుకోవడం, అమలు చేయించుకోవడం, అమానవీయమైన తిరోగమనం జరిగినప్పుడు గొంతెత్తి ఖండించడం, దానిని ప్రతిఘటించే ప్రజా చైతన్యానికి సహకరించడం మానవ హక్కుల ఉద్యమం తన కార్యక్షేత్రంగా ఎంచుకుంది.

**పూర్వకాలపు దౌర్జన్యం దైవసృష్టి, దైవలీలలు అన్న భావనలను తన దుర్మార్గానికి అడ్డం పెట్టుకొనింది. ఇంతటి అన్యాయమా అంటే అది దైవ నిర్ణయం అనింది. ఆధునిక దౌర్జన్యం అంతకంటె తెలివయినది. ఇదే మీకు మంచిది అంటుంది. ప్రజల ఆకాంక్షల నుండి పుట్టిన పరిభాషనే ముసుగుగా ధరించి నువ్వు కోరినదే చేస్తున్నాను అంటుంది.**

పూర్వకాలపు దౌర్జన్యం దైవసృష్టి, దైవలీలలు అన్న భావనలను తన దుర్మార్గానికి అడ్డం పెట్టుకొనింది. ఇంతటి అన్యాయమా అంటే అది దైవ నిర్ణయం అనింది. ఆధునిక దౌర్జన్యం అంతకంటె తెలివయినది. ఇదే మీకు మంచిది అంటుంది. ప్రజల ఆకాంక్షల నుండి పుట్టిన పరిభాషనే ముసుగుగా ధరించి నువ్వు కోరినదే చేస్తున్నాను అంటుంది. అమెరికా తన ప్రపంచ ఆధిపత్య కాంక్షను ప్రజాస్వామ్య స్థాపనగా, మానవ హక్కుల సాధనగా, ప్రపంచ శాంతి పునరుద్ధరణగా చూపించి ఇరాక్ నుండి అఫ్ఘానిస్తాన్ దాకా నిరాయుధ పౌరులను సహితం ఊచకోత కోసిన యుద్ధాలను సమర్ధించుకున్న వైనం తెలిసినదే. ఇదే నీతి దేశపాలనలోనూ అమలవుతున్నది.

- పేదలకు ఉపాధి అవకాశాలు కల్పించే పారిశ్రామీకరణ గ్రామీణ పేదరికం నుండి తమను విముక్తం చేస్తుందని ప్రజలు ఒకనాడు ఆశించారు. ఉపాధి బదులు బడాపెట్టుబడిదార్లకు వేగంగా విపరీతంగా లాభాలు తెచ్చిపెట్టే లక్ష్యాన్ని నిలబెట్టి అందుకోసం భూమీ నీళ్లూ గాలీ అడవులూ అన్నీ వారికి కట్టబెట్టే పారిశ్రామీకరణ ఇప్పుడు భారీగా చేపడుతున్నారు. దానివల్ల దక్కే ఉపాధి 10 పైసలయితే పోయేది 90 పైసలు. అస్తవ్యస్తమైన గ్రామీణ జీవితం స్థానంలో లభించేది నలుగురికి నాలుగు దినాలు 'నష్టపరిహారాన్ని' ఖర్చుచేసే జల్సా, అందరికీ శాశ్వత బికారితనం. దీనిని కూడ ఉపాధి కల్పించడం అనే అబద్ధపు లక్ష్యం పేరిట సాగించుకుంటున్నారు. సెజ్‌లు, ఓపెన్ కాస్ట్ గనులు, పారిశ్రామిక కారిడార్ దీనికి పరాకాష్ఠ.
- చిన్న రైతులు, మధ్యతరగతి రైతులు తమవద్ద పరిమితంగా ఉన్న వనరులను పోగు చేసుకొని కలిసి మెలిసి వ్యవసాయం చేసుకుంటే అందరి జీవితాలూ మెరుగవుతాయనేది సహకార వ్యవసాయం వెనకున్న భావన. ముల్కనూరు సహకార సంఘం వంటివి అది సాధ్యమేనని రుజువు చేసాయి. మన పాలకులు ఈ సహకార భావనను ఇన్నేళ్లూ భ్రష్టుపరచి, ఇప్పుడు రైతుల ప్రయోజనాలు కాక వ్యవసాయ వ్యాపారం (అగ్రి బిజినెస్) చేసే కంపెనీల వర్తక ప్రయోజనాన్ని లక్ష్యంగా

# నేటి అవసరం

గల బడా వ్యవసాయ క్షేత్రాలను తయారు చేయడం కోసం రైతులను తమ భూములను పోగుచేసి అప్పగించమంటున్నారు. దీనికి సహితం సహకార వ్యవసాయం అనే పేరు పెడుతున్నారు.

– పిల్లలు తమ బాల్యాన్ని పశువుల కాపర్లుగా గడపకుండా చదువుకొని జీవితాలు బాగుపరుచుకునే అవకాశం కల్పించే విద్యాహక్కు ఉండాలన్న ఆరాటం జాతీయోద్యమ కాలంనుండి ఉంది. భారత రాజ్యాంగ ఆదేశాలలోనూ దానిని చేర్చడం జరిగింది. మన పాలకులు ఆ ఆదేశాన్ని అమలు చేయకపోగా ఉమ్మడిగా ఉన్న విద్యావ్యవస్థను ధ్వంసం చేసి, డబ్బును బట్టి కులాన్ని బట్టి హోదాను బట్టి స్కూళ్ళను ఎంచుకునే అవకాశం కల్పించారు. దానిని పూర్తి కానిచ్చి, ఇప్పుడు చదువు చెప్పని ప్రభుత్వ పాఠశాలలలో గతిలేని పిల్లలకు నిర్బంధంగా చదువు చెప్తామంటూ చట్టం చేసారు. ఇది రాజ్యాంగ ఆదేశానికి జవాబేనని బుకాయిస్తున్నారు.

– దైనందిన ఆరోగ్యాన్ని కాపాడగల ప్రజారోగ్య వ్యవస్థను పాడుచేసి ఆరోగ్యాన్ని కలర్ టివిలాగ కొనుగోలు వస్తువుగా మార్చి ఇప్పుడు తీవ్రమైన రోగాలకు కార్పొరేట్ ఆస్పత్రులలో ప్రభుత్వం ఖర్చుతో ఆపరేషన్ చేయించే పథకాన్ని ప్రవేశపెట్టారు. కార్పొరేట్ ఆస్పత్రుల వ్యాపారాన్ని మెరుగుపరుస్తూ ఆరోగ్యాన్ని ప్రజల హక్కుగా గుర్తిస్తున్నాం అంటున్నారు. అడవులలో నిత్యం చనిపోతున్న ఆదివాసుల ఆరోగ్యాన్ని గురించి ఏ కదలికా లేకున్నా నోరున్న వాళ్లకు అంటుకున్న స్వైన్‌ఫ్లూ గురించి హైరానపడిపోతే చాలు ప్రజారోగ్యాన్ని గురించి అప్రమత్తంగా ఉన్నట్టేనంటున్నారు.

– సామాజిక రాజకీయ సంక్షోభాల నుండి సాయుధ పోరాటాలు పుట్టిన చోట, చర్య-ప్రతి చర్యలకు విసిగిన ప్రజలలో న్యాయబద్ధమైన శాంతి పట్ల పెరిగే ఆకాంక్షను ఆసరా చేసుకొని పోలీసులనూ పారామిలిటరీనీ దింపి ప్రజలను వారి భద్రత పేరిట క్యాంపులలో నింపి మిలిటెంట్లను హతమార్చి ఇంక న్యాయం చేయనక్కరలేదని చేతులు దులిపేసుకుంటున్నారు. దీనికి శాంతి స్థాపన అనే పేరు పెడుతున్నారు.

**హక్కుల భాషనూ భావాలనూ కూడ మన పాలకుల కౌటిల్యంనుండి కాపాడుకోవలసిన అవసరం ఉందని మానవ హక్కుల ఉద్యమం గుర్తిస్తుంది. విజ్ఞతతో వ్యవహరించకపోతే భాషను చూసి అదే భావం అనుకొని మోసపోయే ప్రమాదం ఉందనీ లేదా భాషతో పాటు భావాన్ని కూడ తిరస్కరించే ప్రమాదమూ ఉందనీ గుర్తిస్తుంది.**

– మహిళలకు చట్ట సభలలో మూడవ వంతు రిజర్వేషన్ ఇవ్వడానికీ అందులో ఒబిసి కోటా కల్పించడానికీ మధ్య వైరుధ్యమేమీ లేకున్నా, రెండూ రాజ్యాంగ సమ్మతమయిన చర్యలే అయినా దీనిపేరు చెప్పి దాన్ని ఆపి, 'మహిళా సాధికారత' ఎప్పటికీ తమ లక్ష్యమేనంటున్నారు.

హక్కుల భాషనూ భావాలనూ కూడ మన పాలకుల కౌటిల్యంనుండి కాపాడుకోవలసిన అవసరం ఉందని మానవ హక్కుల ఉద్యమం గుర్తిస్తుంది. విజ్ఞతతో వ్యవహరించకపోతే భాషను చూసి అదే భావం అనుకొని మోసపోయే ప్రమాదం ఉందనీ లేదా భాషతో పాటు భావాన్ని కూడ తిరస్కరించే ప్రమాదమూ ఉందనీ గుర్తిస్తుంది.

భారతీయ జనతాపార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో మైనారిటీలను ఊచకోత కోసిన దుండగులు వారిపైననే నిందలు వేసి ఏ తప్పూ చేయలేదని రుజువు చేసుకునే స్థితికి వారినే నెట్టడం ఈ కౌటిల్యానికి ప్రముఖ ఉదాహరణ.

ప్రస్తుతానికొస్తే, తీవ్ర కరువు ఇవ్వాళ రాష్ట్రాన్ని కుదిపేస్తున్న సమస్య. కరువులో చిక్కుకున్న ప్రజలకు ఏ హక్కులున్నాయని అడిగితే, ఉపాధిహామీ పథకాన్ని మినహాయిస్తే ప్రభుత్వ దయాదాక్షిణ్యాలు తప్ప కచ్చితంగా అమలయి తీరవలసిన హక్కులేవీ చట్టాలలో లేవని చెప్పవలసి ఉంటుంది. సుప్రీంకోర్టు ఆహార భద్రతను దృష్టిలో ఉంచుకొని కొంతకాలంగా జారీ చేస్తున్న ఆదేశాలు కొన్ని హక్కులు కల్పిస్తాయి. అయితే అవి చాలవన్నది ఒక విషయమయితే, చట్టసభలు చేసిన చట్టాల అమలే తరచుగా గగనం అయిన పరిస్థితిలో కోర్టు ఆదేశాలను అడిగేవాడెవడు?

కరువు కాలంలో తప్పనిసరిగా ప్రజలకు అందవలసిన ఆసరాను హక్కులుగా క్రోడీకరించి వాటి అమలుకు అవసరమైన యంత్రాంగాన్ని నిర్దేశించి ఒక సమగ్రమైన చట్టాన్ని చేయాల్సిన అవసరం ఉంది. అందులో పశువులకు తిండి, మనుషులకు పని, గ్రామాలకు తాగునీరు, తీవ్ర దుర్భిక్ష ప్రాంతాలలో గంజి కేంద్రాల నిర్వహణ, ప్రభుత్వ రుణాల రద్దుతో పాటు ప్రైవేట్ రుణాలను ప్రభుత్వ పరం చేసే ఏర్పాటు, పిల్లలకు అంగన్‌వాడీలు స్కూళ్ళలోనేకాక బడికి పోయినా పోకున్నా తప్పనిసరి పౌష్టికాహారం, చెరువులతో సహా అన్ని నీటి వనరుల పునరుద్ధరణ, రైతుల దగ్గర ఇంకా మిగిలిపోయిన రబీ పంట కొనుగోలు, కాలాతీత మయినాక కురిసే వర్షాలకు తగిన ప్రత్యామ్నాయ విత్తనాల సరఫరా, ఆహార ధాన్యాలను దాచుకొని నల్లబజారులో అమ్ముకునే వ్యాపారులపైన క్రిమినల్ కేసులు పెట్టడంతోపాటు భారీగా జుర్మానా వసూలు చేసి వ్యవసాయదారుల కోసం దానిని వినియోగించడం ఇత్యాది విషయాలన్నిటికీ చోటు ఉండాలని డిమాండు చేయడం, దానికోసం ఉద్యమం నిర్మించడానికి కృషి చేయడం మా కర్తవ్యంగా మేము భావిస్తున్నాం.

మా ఈ ప్రయత్నానికి మీ అందరి సహకారం కోరుతూ..

**మానవహక్కుల వేదిక**
**Human Rights Forum (HRF)**
ఆగస్టు 30, 2009

# కార్యక్రమం

**2009 అక్టోబర్ 2 ఉదయం 10 గంటల నుండి**
సాయంత్రం 5 గంటల దాకా సదస్సు
**జి. నరేంద్రనాథ్ నగర్** (కృష్ణకళామందిరం, పెద్దగడియారం దగ్గర), అనంతపురం

## ఆహార భద్రత
**హర్ష్ మందర్** (రిటైర్డ్ ఐఏఎస్ అధికారి)

## ప్రజాస్వామ్యంపైన సంఘ్ పరివార్ దాడి
ప్రొఫెసర్ **రాంపున్యాని** (రచయిత, ముంబై)

## ఆర్థిక మాంద్యం, బడుగు దేశాల ప్రజల జీవనంపైన ప్రభావం
ప్రొఫెసర్ **డి. నరసింహారెడ్డి**
(ఆర్థిక శాస్త్రవేత్త, హైదరాబాద్)

## శ్రీలంక తమిళుల భవితవ్యం
**వి. గీత** (రచయిత్రి, చెన్నై)

సాయంత్రం 5 గంటలకు ఊరేగింపు,
6 గంటలకు బహిరంగ సభ
ఎం. సాంబశివరావు సభాప్రాంగణం
(కృష్ణకళామందిరం, పెద్దగడియారం దగ్గర)

**జి. రామాంజనేయులు**
(వ్యవసాయ పరిశోధకుడు, హైదరాబాద్)
**కె. బాలగోపాల్, బుర్ర రాములు**
తదితరులు మాట్లాడతారు.

సదస్సుకూ బహిరంగ సభకూ అందరికీ ఆహ్వానం
అక్టోబర్ 3 సంస్థాగత కార్యక్రమం మాత్రమే

ప్రచురణకర్త : కె. బాలగోపాల్, 301, శ్రీరామ్ రెసిడెన్సీ, ప్రియా కాలనీ, గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 028, ఫోన్ : 040–23537969